క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు సన్మానం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్ 14 జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రజిత, శ్రీవాణి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారితో పాటు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన వారికి గ్రామ ఎస్సీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలో క్రీడాకారులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీడీ మద్దమ్మ, కోచ్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు..



వనపర్తి రూరల్: జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, వివిధ మండలాల గౌడ సంఘం నాయకులతో కలిసి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులును శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రాజశేఖర్‌గౌడ్, వెంకటన్నగౌడ్, యాదగిరిగౌడ్, బాల్‌రాజుగౌడ్, సురేశ్‌గౌడ్, మధుసూదన్‌గౌడ్, భగవంతుగౌడ్, రవీందర్‌గౌడ్, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

2 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వీపనగండ్ల: మండలంలోని సంపత్‌రావుపల్లి సమీపంలో మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తూంకుంటకు చెందిన రామన్‌గౌడ్, పెద్దరాంబాబు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను తరలిస్తుండగా వారి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వనపర్తి రూరల్: మండలంలోని తూర్పుతండా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశామని వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని తూర్పుతండాకు చెందిన జగదీష్, లక్ష్మణ్‌నాయక్ రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా.. అంకూరులో పోలీసులు ట్రాక్టర్ ఆపి విచారణ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి



అమరచింత: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ హైదరాబాద్‌లోని పీఎఫ్ కార్యాలయంలో రీజినల్ కమిషనర్–2 వినాయకన్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించామని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సామేలు, రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా బీడీ కార్మికులు పీఎఫ్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

ఆత్మకూర్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, శ్రీవాణి పాఠశాలలో మంగళవారం స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆత్మకూర్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతాహీ సేవా 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త గురించి, పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి



వీపనగండ్లలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాణి

పాన్‌గల్: బాల్య వివాహాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్‌బేగం అన్నారు. మంగళవారం మండలంలోని జమ్మాపూర్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులు బాలల హక్కులను పరిరక్షిస్తూ వారికి తోడ్పాటునందించాలన్నారు. బాలకార్మిక నిర్మూలన వ్యవస్థ, బాలల హక్కులను కాపాడాలని కోరారు. బడిఈడు పిల్లలను పనుల్లో పెట్టుకున్నా, బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించినా చట్టరీత్యా కేసులు నమోదు అవుతాయన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 100 డయల్ నెంబర్లపై అవగాహన కల్పించారు. సమావేశంలో రూరల్ అభివృద్ధి సొసైటీ సోషల్ మొబిలైజర్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇష్టంతో చదివితేనే ఉత్తమ ఫలితాలు'

వీపనగండ్ల: ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని ఎస్‌ఐ రాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిలక ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ద్వారా బాల బాలికలకు అందే భద్రత, హెల్ప్‌లైన్‌ను వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకొని తల్లిదండ్రుల ఆశయాలను నేరవేర్చిన వారమవుతామని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అరుణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



జమ్మాపూర్‌లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్ బేగం

మత్స్యకారుల అభ్యున్నతే కృషి



పాన్‌గల్ చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎంపీడీఓ, సంఘం నాయకులు

పాన్‌గల్: మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. ఆయన మత్స్యకారుల సంఘం నాయకులతో కలిసి మంగళవారం మండల కేంద్రంలోని పాల్కిచెరువు, కేతేపల్లి చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందిస్తుందన్నారు. పాన్‌గల్ చెరువులో 60వేలు, కేతేపల్లి చెరువులో 27 వేలు చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సిబ్బంది భరత్, వీరేష్, రాజు, మత్స్యకార సంఘం నాయకులు బిచ్చన్న, బాలస్వామి, నర్సింహ, గంగన్న, రాములు ఉన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: చిన్నారులకు సమయానికి వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తూ.. వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల నమోదు, హై రిస్కు కేసుల గుర్తింపు, రక్తహీనత గల వారిని ఆస్పత్రులకు తీసుకెళ్లి తగు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందించాలన్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించడం, ప్రతి ఆశా కార్యకర్త వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు శ్రీకాంత్, నాగరాజు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాల వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు, జేవీవీ సభ్యులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబురాల వాల్‌పోస్టర్‌ను జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు భాస్కర్, హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు, ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 07న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే డిసెంబర్ 14, 15, 16న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ పోటీల్లో 8, 9, 10వ తరగతి తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులన్నారు. కార్యక్రమంలో జేవీవీ మండల నాయకులు వారస్వామి, నాగేష్, మరాటి రామకృష్ణ, ఉపాధ్యాయులు నరసింహాగౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

తీగజాతి మొక్కలు తొలగించాలి

వనపర్తిటౌన్: పురపాలికలోని 32వ వార్డులో విద్యుత్ తీగలపై చెట్లు అల్లుకుపోయాయని, వాటిని వెంటనే తొలగించాలని పుర కౌన్సిలర్ నాగన్నయాదవ్ మంగళవారం విద్యుత్ ఏఈ రాజయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. వీటిని తొలగించాలని కొన్ని నెలలుగా చెబుతున్నా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అలాగే వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

ప్రజా సమస్యలపై పోరాటం

పాన్‌గల్: సీపీఎం మండల 8వ మహాసభల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ సమక్షంలో మంగళవారం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా తెల్లరాళ్లపల్లితండాకు చెందిన బాల్యనాయక్‌తో పాటు 11 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. మండల నూతన కమిటీ ఐకమత్యంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగించాలని జిల్లా కార్యదర్శి సూచించారు. మండల నూతన కమిటీని జిల్లా నాయకులు, మండల నాయకులు అభినందించారు.

రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు



ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి

మదనాపురం: రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనదారులు, బైకర్లు రాత్రి సమయాల్లో వాటిని గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారని ఎస్‌ఐ కర్నె శేఖర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పొలాలు, కల్లాల్లో ధాన్యం రాశులు పోసుకోవాలని కోరారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులు నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దని సూచించారు. రోడ్లపై ధాన్యం పోసి నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల రాత్రి సమయంలో వాటిని గమనించని ద్విచక్ర వాహనదారులు తగిలి చనిపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. రోడ్లపై ధాన్యం పోయవద్దని గ్రామ పెద్దలు కూడా రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైన ఘటన జరిగితే వారినే బాధ్యులను చేస్తామన్నారు.

ఎదురెదురుగా 2 బైకులు ఢీ

గోపాల్‌పేట: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న రామన్‌పాడు పంప్‌హౌస్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురు యువకులు గాయాలపాలయ్యారు. గోపాల్‌పేటకు చెందిన ఇద్దరు యువకులు సంతోష్, ధర్మరాజు వనపర్తికి పనిచేసేందుకు వెళ్లి.. మంగళవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో తాడిపర్తికి చెందిన రాసమోని భాస్కర్, సుక్కమధు, రాసమోని కృష్ణ ముగ్గురు యువకులు మద్యం తాగి ద్విచక్రవాహనంపై తాడిపర్తికి వెళ్తూ రామన్‌పాడు ట్యాంకు సమీపంలో వనపర్తి నుంచి వస్తున్న సంతోష్, ధర్మరాజు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. దీంతో గోపాల్‌పేటకు వస్తున్న ఇద్దరు యువకులు, తాడిపర్తి యువకులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

వనపర్తి రూరల్: రెండు బైక్‌లు ఎదురుగా ఢీకొనడంతో ఓవ్యక్తి గాయపడిన ఘటన పెద్దగూడెం తండా సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన కన్నయ్య బైక్‌పై వనపర్తికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా.. వనపర్తి మండలంలోని పెద్దగూడెం తండా వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో కన్నయ్యకు గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దాశరథికి ఘన నివాళి



దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: తెలంగాణ ప్రజల గుండెచప్పుడుగా తన గేయాలతో నిజాంను నిలదీసిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు అని ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. దాశరథి వర్ధంతిని పురస్కరించుకొని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజహితమే లక్ష్యంగా సాహిత్యంతో ప్రజలను చైతన్యవంతం చేసిన మహాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, అభ్యుదయవాదిగా పేరొందిన మానవతవాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, గంధం నాగరాజు, మండ్ల దేవన్న, బాలేమియా, యోసేపు, చిన్నరాములు, జగపతిరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: పొలాలకు ఏర్పాటుచేసుకున్న దారికి డబ్బులు కట్టే విషయంలో మండడి వర్ధారెడ్డి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనలో నలుగురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడు తెలిపారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మేఘారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాంరెడ్డి, గొల్ల ఉషన్నలు వర్ధారెడ్డిని డబ్బులు కట్టాలని వేధించారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీశాడు. మృతుడి భార్య మండడి సరిత ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్లను రికవరీ చేసి మంగళవారం బాధితులకు అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన రఫీఖ్ ఆగస్టులో, మూలమళ్లకు చెందిన వినయ్‌కుమార్ అక్టోబర్‌లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కేసు నమోదు చేసి సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించి, రికవరీ చేశామన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న పుట్టా ఆంజనేయులు

వనపర్తి రూరల్: భవన నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భవన ఇతర నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గుర్తింపు కార్డులు ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు సకాలంలో అందజేయాలని కోరారు. వనపర్తి జిల్లా ఏర్పడి దాదాపు 8 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ జిల్లా కార్మిక శాఖ కార్యాలయం లేకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కార్మిక శాఖ, రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్మిక శాఖ ఎంప్లాయిస్ సెట్ ఇన్సూరెన్స్, ఈఎస్‌ఐ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, చంద్రుడు, వెంకటేష్, వెంకటేశ్వర్లు, ఎస్‌కే బాబా, భాస్కర్ పాల్గొన్నారు.

కోటిలింగాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు



కోటిలింగాల ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న కోటిలింగాల ప్రతిష్ఠ పూజలు నాలుగు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. పదకొండు వేల శివలింగాలు ప్రతిష్ఠించే అపూర్వ కార్యక్రమం ఆలయంలో ఏర్పాటు చేయగా.. ఆదోని వీరశైవ అగమ పాఠశాల అధ్యాపకులు, అర్చకులు జగదీశ్వరస్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో జరుపగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. రుద్రహోమం, పదకొండు వేల శివలింగాలు కలిగిన శివకోటి యంత్రాలకు రుద్రపఠనంతో అభిషేకం చేయించారు. పూజ కార్యక్రమం అనంతనం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలతో అరాచకం



మాట్లాడుతున్న విజయరాములు


అమరచింత: మతోన్మాద నినాదంతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిచ్చుపెడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టి దేశంలో సెక్యులరిజానికి తూట్లు పొడుస్తుందని ఆరోపించారు. మండల కేంద్రంలోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సీపీఐ మున్సిపల్ పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై విమర్శలు చేశారు. ఈసందర్భంగా విజయరాములు మాట్లాడుతూ హిందూ జపం ముసుగులో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పేదల కష్టాలను తీర్చడంలో విఫలమైందన్నారు. దేశంలో అన్ని జాతీయ పార్టీల కంటే సీపీఐ పార్టీకే వందేళ్ల చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ కంటే ముందే సమైక్యవాదం, సామ్యవాదం, స్వాతంత్ర్యం అనే నినాదంతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఏకైక జాతీయ పార్టీ సీపీఐ అన్నారు. దేశంలో 85 శాతం పైగా రైతులు ఉండగా వారికి వ్యతిరేకంగా నల్ల వ్యవసాయ చట్టాలను అమలులోకి తీసుకోని రావడం ఎంత వరకు సమంజసం అన్నారు. అమరచింత మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు భాస్కర్, అబ్రహం, శ్యాంసుందర్, కుతుబ్, గీత, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



పెద్దమందడిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు నారాయణ

కొత్తకోట రూరల్: స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అన్నారు. మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు వివరించడంతో పాటు సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు. బీజేపీకి గతంలో మాదిరిగా కాకుండా ఎంతో ఆదరణ లభిస్తుందని, యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జీ మున్నూర్ రవి, మండల అధ్యక్షుడు కావలి తిరుపతయ్య, శ్రీనివాసులు, శివారెడ్డి, చెన్నయ్య, రాములు, విష్ణు, కర్ణాకర్, బాలరాజు, రవి, బాబన్న, కిషన్‌నాయక్, మోహన్‌నాయక్, గోవర్ధన్, రాము, నరేష్, బాలరాజు, రాము తదితరులు ఉన్నారు.




పాన్‌గల్‌లో..

పాన్‌గల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు యువత స్వచ్ఛందంగా ఆకర్శితులై బీజేపీ సభ్యత్వాలు తీసుకుంటున్నారని పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, అసెంబ్లీ కో కన్వీనర్ అన్వేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు పిలుపు మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ సభ్యత్వాలను చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పుట్ట నాగరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌యాదవ్, నరేష్‌రెడ్డి, కుర్మయ్య, రాములు, ఆంజనేయులు, గంగస్వామి, చందు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

కొత్తకోట: స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు మంగళవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృపయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా వి.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా ఆర్.రమేష్, కోశాధికారిగా ఎండీ మగ్బూల్, కమిటీ సభ్యులుగా మద్దిలేటి, కొండన్న, కె.మన్నెమ్మ, జె.పద్మ, రాజేశ్వరి, సలహాదారులుగా నోవెల్, జాజుల రమేష్, జాన్సన్ ఎన్నికయ్యారు. కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిచేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు కృపయ్య అన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఆనంద్‌రాజు, కుర్మన్న, శివలక్ష్మి, శిరీష, సరళ, భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ అడ్డగోలు బాదుడు



వనపర్తి టౌన్: వనపర్తి ఆర్టీసీ డిపోలో పర్యవేక్షణ కొరవడడం, టిమ్స్‌లో ఫీడింగ్ తప్పిదాలతో ప్రయాణికులపై భారం పడుతోంది. వనపర్తి నుంచి హైదరాబాద్‌కు రూ. 290 (పెయిర్) టికెట్ ధర ఉండగా.. ఈ నెల 4న సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణికుల నుంచి రూ.400 చొప్పున టికెట్ వసూళ్లు చేయడంతో ప్రయాణికులు ఇదేంటని అడిగితే డ్రైవర్‌ను ప్రశ్నించగా తమ చేతుల్లో ఏమీ లేదని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్టీసీ డీఎంను వివరణ కోరగా.. డ్రైవర్ తప్పిదమని, పండుగల సమయంలో ప్రత్యేక బస్సులు నడిపిన సమయంలో ఏర్పాటు చేసిన టిమ్ ల ద్వారా టికెట్లు ఇవ్వడంతో ఈ పొరపాటు జరిగిందన్నారు. ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వచ్చిన వెంటనే టిమ్ మిషన్లను సవరించామని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో జాలరి మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ సమీపంలో కృష్ణానది బ్యాక్ వాటర్‌లో అనుమానస్పదంగా రాజమండ్రికి చెందిన జాలర్ నాగరాజు (21) మృతి చెందాడు. ఎస్‌ఐ హృషికేష్ వివరాల ప్రకారం గుత్తేదారు మహేష్ నెల రోజుల కిందట చేపలవేటకు రాజమండ్రి నుంచి 12 మంది జాలర్లను తీసుకొచ్చారు. సోమవారం రాత్రి చేపల వేట అనంతరం సోమశిలకు వస్తున్న క్రమంలో జాలర్ నాగరాజు నదిలో పడి చనిపోయినట్లు గుత్తేదారు తెలిపాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. గుత్తేదారు పొంతనలేని సమాధానాలు తెలపడంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.